క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



శరత్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

వాకాడు: మండలంలోని దుగ్గరాజపట్నం పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువనేత ముంగమూరు శరత్ ఇటీవల మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సోమవారం గ్రామానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలు తెలుసుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మధురెడ్డి, కృష్ణయ్య, శీనయ్య, రవి, మధురెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

కోలాహలం.. గ్రామోత్సవం..!



గ్రామోత్సవంలో చెంగాళమ్మ తల్లి

చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు చెంగాళమ్మ ఆలయం తొమ్మిదో వార్షికోత్సవంలో భాగంగా చివరి రోజు సోమవారం అమ్మ వారికి కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పలు రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. బాణా సంచా వేడుకలతో గ్రామోత్సవం జరిపారు. తమ ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మవారికి గ్రామస్తులు రంగ వల్లులు వేసి స్వాగతం పలికారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

నా పొలంలోకి దారి కల్పించండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు

సైదాపురం: "నా పొలంలోకి వెళ్లే దారిని ఆక్రమించిన మా బంధువులు, నన్ను అడ్డుకుంటున్నారు. న్యాయం చేయండి." అంటూ చాగణం రాజు పాళెం గ్రామానికి చెందిన బంకాపురి రమణయ్యతో పాటు ఆయన కుమారుడు సోమవారం తహసీల్దార్ సుభద్రకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. 1980 నుంచి తమ ఉమ్మడి పొలంలో నుంచి వెళ్లేందుకు రహదారి ఉందని, ఆ పొలంలో సుమారు 150 నిమ్మ చెట్లు కూడా సాగు చేసినట్లు చెప్పారు. అయితే తనను ఆ దారిలో వెళ్లనీయకపోవడంతో చెట్లు కూడా ఎండిపోతున్నాయని బాధితుడు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ కోటయ్య

కలువాయి(సైదాపురం) : కలువాయి బస్టాండ్ లో సోమవారం కలువాయి ఎస్ఐ కోటయ్య ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు, స్థానికులకు డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, గుట్కాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. యువత మాదకద్రవ్యాలకు బానిసై చెడిపోతున్నారని తెలిపారు. గంజాయిని తరలించినా, విక్రయించినా, విని యోగించినా సమాచారం అందించాలని కోరారు.

నేడు జాతీయ నులిపురుగుల దినోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ భవాని

రాపూరు: మండలవ్యాప్తంగా మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహించాలని ఎంపీడీఓ భవాని పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మంగళవారం జరిగే జాతీయ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఆల్బెండజోన్ మాత్రలను పంపిణీ చేయాలని చెప్పారు. 1నుంచి 18 ఏళ్లలోపు అందరూ ఆల్బెండజోల్ మత్రలు తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వేపినాపి ఆరోగ్యకేంద్రం వైద్యులు భాను, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు 12.8.2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	115
లేయర్ లైవ్	:	115
బ్రాయిలర్ చికెన్	:	212
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	234
లేయర్ చికెన్	:	195

వరి కోతలు ఆరంభం



- ధరలేక రైతన్న దిగాలు
- పెట్టుబడి సైతం రావడం లేదని ఆవేదన

చిట్టమూరు మండలంలో బోరు నీటి ఆధారంగా రైతులు ఎడగారులో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట కోతలు ప్రారంభించారు. అయితే గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టపోతున్నారు. మండలంలో మెట్టు, శ్వరవాక, గునపాడు, ఎల్లసిరి, అరవపాళెం, తాడిమేడు, ఆరూరు, చిట్టమూరు, బయ్యావారికండ్రిగ, పెళ్లకూరు, తిమ్మారెడ్డి వాగు తదితర గ్రామాల్లో సుమారు 5 వేల హెక్టార్లలోఎంటీయూ 1010 వరి వంగడాన్ని సాగు చేశారు. ప్రస్తుతం దళారులు 75 కిలోల బస్తా రూ.1,340కు కొనుగోలు చేస్తున్నారు. ఇందులో తరుగు, నెమ్ముశాతం కింద బస్తాకు 5 కిలోలు తీసేస్తున్నారు.దీంతో పుట్టికి సుమా రు రూ.900 వరకు నష్టపోతున్నారు. అంతే కాకుండా ఎకరా దిగుబడి గతంలో 40 నుంచి 45 బస్తాలు వచ్చేది, ప్రస్తుతం 30 నుంచి 35 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. వరి కోతకు మిషన్‌కు గంటకు రూ.2,400 తీసుకుంటున్నారని రైతులు తెలిపారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు పైరు నేలకొరగడంతో కోత కోసే సమయంతోపాటు ఖర్చు పెరిగింది. పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

– చిట్టమూరు

నేడు మండల మీట్

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గద్దం అరుణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కోరారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

కలువాయి(సైదాపురం): మండల కేంద్రమైన కలువాయి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేకార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వెలుగు ఏపీఎం రవి మినహా ఏ అధికారి హాజరుకాకపోవడంపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఐటీడీఏ ఆధార్ కేంద్రం ఏర్పాటు

కోట: ఐటీడీఏ ఆధ్వర్యంలో కోట ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని సచివాలయం–3లో ఆధార్ నమోదు కేంద్రాన్ని సోమవారం ఎంపీడీఓ వేణు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులు ఆధార్ కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని, అలాంటి వారికోసం ఐటీడీఏ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారి మహేష్ పాల్గొన్నారు.

కలిమిలికి పరామర్శ



కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, కుమార్తెలను పరామర్శిస్తున్న సర్వజ్ఞకుమార యాచేంద్ర

వెంకటగిరి రూరల్ : వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి, డక్కిలి మండల జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి ఇటీవల కన్నుమూశారు. ఈ నేపథ్యంలో వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర సోమవారం పట్టణంలోని కలిమిలి నివాసానికి చేరుకుని రాజేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భర్త కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, కుమార్తెలు చైతురెడ్డి, యష్ము రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎంఏ నారాయణ, ఆవులు వెంకటేశ్వర్లు, జలగం కామక్షి పాల్గొన్నారు.

అంబరాన్ని తాకేలా పోలేరమ్మ జాతర



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య

వెంకటగిరి రూరల్: పట్టణంలో నిర్వహించనున్న శ్రీ పోలేరమ్మతల్లి జాతర సంబరం అంబరాన్ని తాకేలా వైభవంగా నిర్వహించేందుకు కృషిచేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మొత్తం 32 అంశాలతో మున్సిపల్ సమావేశం నిర్వహించగా ఇందులో 24వ అంశం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ జయప్రకాష్‌ను రద్దు చేసి కొత్త మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌ను నియమించాలని అజెండాలో పొందుపరచారు. అయితే దాన్ని అజెండా నుంచి తొలగించాలని కౌన్సిలర్లు కోరారు. మిగిలిన అంశాలు కౌన్సిల్‌ను ఆమోదించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ మాట్లాడుతూ జాతరను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వంటి మౌళిక సౌకర్యాలపై దృష్టి సారించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

శ్రీనిసన్ సేవా సంస్థకు మున్సిపల్ నిధులు ఎందుకు ఇవ్వాలని, రోడ్ల పక్కన మున్సిపల్ కాంప్లెక్సు దుకాణాలు ఏర్పాటు చేసి ఆదాయం పెంచుకోవాలని, పోలేరమ్మతల్లి జాతరకు మౌళిక సదుపాయాలు కల్పించాలని, దోమల నివారణకు చేపట్టాలని, పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాట్లు చేయాలని, వెంకటగిరి జగనన్న కాలనీ నుంచి ఐఐహెచ్‌టీ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆయా వార్డు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌కు వినతి పత్రంసమర్పించారు.

వైభవం.. మహాకుంభాభిషేకం!



మహాకుంభాభిషేకం జరిపిస్తున్న వేదపండితులు, పాల్గొన్న మేరిగ మురళీధర్

కోట: మండలంలోని కేసవరంలో నూతనంగా నిర్మించిన శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం మహాకుంభాభిషేక వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజు సోమవారం గోపూజ, మహా పూర్ణాహుతి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. దేవస్థానం నిర్మాణం ద్వారా ఎంతో గొప్ప కార్యాన్ని తలపెట్టిన ఆలయ ధర్మకర్త విగ్రహాల రఘురామయ్యను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అభినందించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి దంపతులు మహాకుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ



చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ సుధాకర్

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఆటోను లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కథనం మేరకు బుచ్చినాయుడుకండ్రిగ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సుధాకర్ ఆటోలో నాగలాపురం నుంచి గూడూరుకు బయలు దేరాడు. మార్గమధ్యంలో పండ్లూరు గ్రామ సమీపంలో వేగంగా వస్తున్న లారీ ఆటోను వెనుక నుంచి ఢీకొని వెళ్లిపోయింది. ఆటో బోల్తా పడి డ్రైవర్ సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తిరుపతి ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

గూడూరురూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వామపక్ష పార్టీల నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు జోగి శివకుమార్, ప్రభాకర్, వెంకటరామిరెడ్డి, బి.వి.రమణయ్య, పుట్టా శంకరయ్య, గర్రం రమణయ్య, శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, మధు, భాస్కర్‌రెడ్డి, సీవీఆర్ కుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు ఆపండి

సూళ్లూరుపేట : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెడతామంటే నానా యాగీ చేసిన టీడీపీ నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు పెట్టడం ఏంటని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సీహెచ్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్మార్ట్ మీటర్లు వద్దని అలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ వారి ఆధ్వర్యంలో సోమవారం సూళ్లూరుపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ నాగేంద్ర, రమణయ్య, బాలు, వెంకటకృష్ణ య్య, చెంచమ్మ, కనకమ్మ, శ్రీహరి, శీనయ్య పాల్గొన్నారు.

వెంటనే రద్దు చేయాలి

వెంకటగిరి రూరల్: స్మార్ట్‌మీటర్లను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి బాలకృష్ణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుల్లూరు జాన్ పేర్కొన్నారు. పట్టణంలోని పాలకేంద్రం సబ్‌స్టేషన్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు శివ, భాస్కర్ కుమార్, మునికృష్ణారెడ్డి, ఏఐఎస్ఎఫ్ మధు, రమణయ్య పాల్గొన్నారు.



గూడూరు వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

యాజమాన్య పద్ధతులు లాభదాయకం

దక్కిలి: వరిలో సమగ్ర యాజమాన్యం పద్ధతులు పాటించడం ద్వారా లాభదాయకంగా ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణు గోపాల్‌రావు తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం తిరుపతి జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఓ శిరీషా, సిబ్బంది శ్రీనివాస్,ఏఈఓ రవి ప్రసాద్ పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించాలి

ఓజిలి: గ్రామాల్లో భూసమస్యలను వీఆర్వోలు పరిష్కరించాలని తహసీల్దార్ పద్మావతి ఆదేశించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెల్స్ సెల్ కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. రీసర్వేలో మార్పులను పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం వీఆర్వోలతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

ఉరుములతో కూడిన వర్షం



చిట్టేడులో నేలకొరిగిన వరిపంట

కోట: మండలవ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములతో కూడిన వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యానగర్ ప్రకాశంకాలనీలోని దిగువ ప్రాంతంలో ఇళ్లలోకి నీరు చేరడంతో జనం ఇబ్బందులు పడ్డారు. వెంకన్నపాళెం, తిన్నెలపూడి, చిట్టేడు, వంజివాక ప్రాంతాల్లో కోత దశకు వచ్చిన వరిపంట నేలవాలడంతో నష్టపోయినట్లు రైతులు తెలిపారు.

నులి పురుగులను నివారిద్దాం

గూడూరురూరల్ : నులి పురుగులను నిర్మూలించేందుకు అందరం కలసికట్టుగా కృషి చేద్దామని గూడూరు ఎంపీడీఓ మధుసూదనరావు అన్నారు. నేషనల్ డీవార్మింగ్ డేను పురస్కరించుకుని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రబాబు, సీడీపీఓ మహబూబి, చెన్నూరు పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి, మస్తానయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

డీవార్మింగ్ డేను జయప్రదం చేయండి

బాలాయపల్లి(సైదాపురం): నులి పురుగుల దినోత్సవం (డీవార్మింగ్ డే)ను జయప్రదం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ వినీల్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం నులి పురుగుల దినోత్సవం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటరెడ్డి, లియోనా, సత్యప్రియ, ఎంఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ మధుసూదనరావు

అవగాహనతోనే క్యాన్సర్ దూరం



క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న స్విమ్స్ వైద్యులు

చిల్లకూరు: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుంటే ఆ వ్యాధిని దూరం చేసుకోవచ్చని తిరుపతిలోని స్విమ్స్ వైద్యులు సూచించారు. మండలంలోని చింతవరం, వల్లిపేడు పీహెచ్‌సీలలో పింక్ బస్సు ఆధ్వర్యంలో సోమవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ముందుగా రోగులకు క్యాన్సర్ వ్యాధి ఎలా ఆరంభం అవుతుంది. చివరి దశలో ఎలా మారుతుందనే విషయాలను తెలియజేశారు. వ్యాధి పలు స్టేజీల్లో ఉన్న సమయంలో నయం చేసుకునేందుకు చాలా సమయం, ఖర్చు, అవుతుందని దీనిని దృష్టిలో ఉంచుకుని ముందుగానే క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుని దాని బారిన పడకుండా ఉండాలన్నారు. అనంతరం పలువురుని పరీక్షించి వారి నుంచి నమూనాలను తీసుకున్నారు. కార్యక్రమంలో స్విమ్స్ వైద్యులు పద్మావతి, స్థానిక వైద్యులు బీ సుమ, దినేష్, శివశంకర్, చైతన్య, భాను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రాపూరు-రాజంపేట కొత్త సర్వీసు ప్రారంభం



కొత్త ఆర్టీసీ సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం అనిల్‌కుమార్

రాపూరు: రాపూరు –రాజంపేటకు కొత్త సర్వీసులను సోమవారం నుంచి ప్రారంభించినట్లు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీ డిపోలో బస్సుకు పూజలు చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత నెల 28వ తేదీ రాపూరు ఆర్టీసీ డిపోను సందర్శించిన ఈడీ నాగేంద్రపసాద్ ఇక్కడి ప్రయాణికుల అవసరాలను గుర్తించి రెండు సర్వీసులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని ఆ బస్సులు రావడంతో రాపూరు –రాజంపేటకు బస్సులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ బస్సులు ఉదయం 6.20 గంటలకు, మరో బస్సు 7.10 గంటలకు రాపూరు నుంచి బయలుదేరి రాజంపేటకు చేరుకుంటాయని తెలిపారు. నిత్యం 8 ట్రిప్పులు తిరుగుతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ, ఏఎంఎఫ్, ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ షాపులో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న ఎలక్ట్రికల్ షాపు

చిల్లకూరు:గూడూరు పట్టణంలోని ఆస్పత్రి రోడ్డు లో ఉన్న ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల వస్తువులు కాలిపోయాయి ఘటన వెలుగు చూసింది. వివరాలు ఇలా.. ఆస్పత్రిలో రోడ్డులో ఉన్న ఓ ఎలక్ట్రికల్ షాపు నిర్వాహకులు ఆదివారం రాత్రి దుకాణానికి తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో షాపులో నుంచి పెద్ద శబ్దంతో పాటు పొగలు వస్తుండడంతో చుట్టుపక్కల వారు షట్టర్ పగులగొట్టి చూశారు.అప్పటికే దుకాణంలోని ఏసీ నుంచి మంటలు వస్తుండడం గమనించి.. అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. మంటలను అదుపు చేశారు. ప్రమాదం తప్పడంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం దుకాణ యజమానికి సమాచారం ఇచ్చారు. ఎలక్ట్రికల్ షాపులో జరిగిన ప్రమాదంలో పలు వస్తువులు, సీలింగ్ కొంతమేర దెబ్బతిన్నాయి.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి



ధర్నా చేస్తున్న కలపాడు గ్రామ పేదలు, సీపీఎం నాయకులు

గూడూరురూరల్ : డివిజన్ పరిధిలోని వెంకటగిరి మండలం కలపాడు గ్రామంలోని పేదలకు ప్రభుత్వ భూమిని పంచాలని కోరుతూ సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో పేదలు ధర్నా చేశారు. సీపీఎం వెంకటగిరి ఏరియా కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కలపాడు గ్రామ సర్వే నెంబర్–1లో 1441.30 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం మేత పోరంబోకు, అడవి పోరంబోకు భూములుగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం రాజకీయ పలుకుబడి ఉన్న పెత్తందారులు, స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులు సుమారు 45 ఎకరాలు ఆక్రమించారని చెప్పారు. కబ్జాదారులకు వీఆర్వో మద్దతుగా ఉంటూ దళితులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, ఎంబేటి చంద్రయ్య, చెంచు కృష్ణయ్య, చెంచురామయ్య, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ చైర్స్ పంపిణీ



స్టడీ చైర్స్, సైకిల్ అందజేస్తున్న రవికుమార్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

గూడూరురూరల్ : పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ చైర్స్ పంపిణీ చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత లయన్ బయ్యా రవికుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు స్టడీ చైర్స్, పేపర్ బాయ్‌కు సైకిల్‌ను తన చేతుల మీదుగా అందించడం అభినందనీయమన్నారు. క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా అక్కన రమణయ్య, కార్యదర్శిగా ఆర్.రవిచంద్ర, కోశాధికారిగా వీరేంద్రనాథ్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డీఎస్ కుమార్, ఎస్.ఎస్.వి.రామ్మోహన్‌రావు, డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, ఆర్.వి.రావు, మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్, సోమిశెట్టి చెంచురామయ్య, శీనయ్య, రూపేష్‌రెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

కండలేరులో 25.208 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 25.208 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 5,540 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,625, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.